www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 4 జులై 2023
5
తిరుపతి



నేడే 'అమూల్'కు శంకుస్థాపన

- చీలేపల్లి వద్ద 300 పడకల ఆస్పత్రికి భూమిపూజ
- సీఎం జగన్ పర్యటనకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రులు

సిఎం పర్యటనపై చిత్తూరులో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సగిలి షన్మోహన్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్తూరు జిల్లా పర్యటన సందర్భంగా జిల్లా యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేసింది. సభావేదిక, హెలిప్యాడ్‌ల వద్ద పటిష్టంగా గ్యాలరీల నిర్వహణ, తాగునీటి సదుపాయం తదితర ఏర్పాట్లు చేశారు. విజయ డెయిరీని అమూల్ చేతుల్లో పెడుతూ శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో భారీఎత్తున బందోబస్తు నిర్వహిస్తున్నారు. బహిరంగసభ వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి, రాష్ట్ర అటవీ శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు ఎంపి ఎన్.రెడ్డెప్ప, జడ్‌పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ముఖ్యమంత్రి పర్యటనల సమన్వయ కర్త టి.రఘురాం, ఎపి డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ఎమ్‌డి బాబు అహ్మద్, కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్‌పి వై.రిశాంత్‌రెడ్డి, చిత్తూరు ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు, ఎపిఎస్‌ఆర్‌టిసి వైస్‌ఛైర్మన్ విజయానందరెడ్డి, జేసీ వి.శ్రీనివాసులు, డిఆర్‌ఒ ఎన్.రాజశేఖర్‌లతో కలిసి పరిశీలించారు. బహిరంగసభ వద్ద ఎల్ఇడి స్క్రీన్‌లు, బారికేడ్లు, పార్కింగ్, సీటింగ్, తాగునీటి వసతి, శానిటేషన్ తదితర సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు.

నేడు వామపక్షాల నిరసనకు పిలుపు

మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ప్రజా సమస్యలను సిఎం పట్టించుకుని, జిల్లాను అభివృద్ధి చేయాలని సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలుపుతామని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు వాడా గంగరాజు, నాగరాజన్ వెల్లడించారు. సిపిఎం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ చిత్తూరు నగరాభివృద్ధికి నిధులు కేటాయించాలని, తక్షణం మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని, జిల్లా కేంద్రంలో ఇఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని కోరారు. గార్మెంట్స్, క్వారీ, ప్రైవేట్ నర్సింగ్ హోమ్‌లలోపనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. చిత్తూరు కేంద్రానికి ఎన్టీఆర్ జలాశయం నుంచి నీటిని సరఫరా చేసి ఆదుకోవాలన్నారు. మూతబడిన పరిశ్రమలను పునఃప్రారంభిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్‌చేశారు. విజయ డెయిరీ ప్రాంగణంలో వీరరాఘవులునాయుడు విగ్రహాన్ని యథాస్థానంలో ఏర్పాటు చేయాలని కోరారు. విజయ డెయిరీలో మిషన్లు స్క్రాప్‌ను తప్పుడు పద్ధతుల్లో టెండర్లు వేసి 7కోట్ల విలువ చేసే ఇనుమును కేవలం కోటి 40 లక్షలకు గుత్తేదారులకు అప్పగించడం వెనుకున్న అవినీతి కుంభకోణంపై సిట్టింగ్ జడ్జి చే విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

పర్యటనను విజయవంతం చేయాలి : కలెక్టర్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్తూరు పట్టణానికి విచ్చేస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం సమన్వయంతో పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ తెలిపారు. ఎస్‌పి రిశాంత్‌రెడ్డితో కలిసి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. చిత్తూరు అమూల్ డెయిరీ, 300 పడకలతో చీలాపల్లి సిఎంసి ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమాలకు సిఎం విచ్చేస్తున్నారని తెలిపారు. ఎస్‌పి మాట్లాడుతూ కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నామన్నారు.

అమూల్ డెయిరీ మహిళా రైతులకు వరం : డిప్యూటీ సిఎం

అమూల్ డెయిరీ ప్రారంభిస్తే మహిళా రైతులకు వరమని ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి అన్నారు.వ్యవసాయం ద్వారానే కాకుండా పాడి పరిశ్రమ ద్వారా ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఇప్పటికే అమూల్‌కు పాలు పోస్తున్న రైతులకు లీటర్‌పై రూ.15 అదనంగా ఇస్తున్నామన్నారు. ఇప్పటికే జగన్మోహన్‌రెడ్డి 98.5 శాతం హామీలను అమలు చేశారన్నారు. 300 పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తయితే చిత్తూరు ప్రజలు వేలూరుకు వెళ్లకుండా ఇక్కడే చూపించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆరోగ్యశ్రీ అమలయ్యేలా సిఎంతో మాట్లాడనున్నట్లు తెలిపారు.

పోలీసుల నిర్బంధంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

సిఎం పర్యటన షెడ్యూల్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం చిత్తూరు జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో ఉదయం రేణిగుంట విమానాశ్రయానికి 9.15 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుండి 9.25 గంటలకు హెలికాప్టర్‌లో చిత్తూరు జిల్లాకు బయల్దేరి వెళ్లి అక్కడ వివిధ అభివద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం తిరిగి మధ్యాహ్నం 2.05 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని 2.15 గంటలకు గన్నవరం తిరుగు ప్రయాణం కానున్నారు.

అమూల్‌కు అప్పగించడంలో కుట్రను వెల్లడించాలి

మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంగళవారం చిత్తూరు డెయిరీ స్థానంలో అమూల్ డెయిరీని స్థాపించేందుకు భూమి పూజ చేస్తున్నారని, దీని వెనుక ఉన్న కుట్రను సిఎం జగన్మోహన్‌రెడ్డి వెల్లడించాలని సిపిఎం మాజీ రాజ్యసభ సభ్యులు పెనుమల్లి మధు డిమాండ్ చేశారు. బిజెపి చేతిలో కీలుబొమ్మగా మారి సంస్కరణలను అమలు చేస్తున్నారని విమర్శించారు. తిరుపతి యశోదా నగర్ లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సోమవారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడారు. అమూల్ డెయిరీ రాష్ట్రంలో పాడి రైతులను కబ్జా చేయడమే కాకుండా వారి ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా విధానాలు ఉన్నాయని విమర్శించారు. అమూల్ డెయిరీని ప్రమోట్ చేస్తే వచ్చే ఆదాయం అహ్మదాబాద్‌కు పోతుంది మినహా రాష్ట్రానికి ఒరిగేదేమీ లేదన్నారు. రాష్ట్రానికి చిల్లి గవ్వ కూడా ఖర్చుపెట్టే పరిస్థితి లేదన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ రాజ్యసభ సభ్యులు పి.మధు

అమ్మకానికి గాజులమండ్యం షుగర్ ఫ్యాక్టరీ

- ముక్కలు ముక్కలుగా... అమ్మకానికి...!
- 166 ఎకరాలను జెసిబిలతో చదును
- రూ.వెయ్యి కోట్ల ఆస్తులు సమర్పయామి
- ఓ మంత్రి, ముగ్గురు ఎమ్మెల్యేల ధారాదత్తం



షుగర్ ఫ్యాక్టరీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'మేం అధికారంలోకి వస్తే చిత్తూరు, గాజులమండ్యం సుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తాం.. రైతులకు భరోసా కల్పిస్తాం.. ఉద్యోగులకు భద్రత ఇస్తాం' అంటూ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన మాటను జగన్మోహన్ రెడ్డి తప్పారు. అధికారంలోకి వచ్చిన తరువాత 'మాట తప్పారు.. మడమ తిప్పారు..' ఏకంగా ప్రభుత్వ ఆస్తులను అమ్మకానికి పెట్టారు. మొన్నటికిమొన్న చిత్తూరు 'విజయ' డెయిరీని 'అమూల్' కార్పొరేట్ కంపెనీకి ధారాదత్తం చేశారు. ఇప్పుడు గాజులమండ్యం శ్రీ వెంకటేశ్వర సుగర్ ఫ్యాక్టరీని ముక్కలు ముక్కలుగా చేసి 'నలుగురు ప్రజాప్రతినిధులు' పంచుకోనున్నారు. ఈ మేరకు ఫైల్ చకచకా నడుస్తోంది.. వెయ్యి కోట్ల రూపాయల విలువ చేసే 166 ఎకరాల భూమిని జెసిబిలతో చదును చేస్తున్నారు. ఇక సర్వే చేసి, ముక్కలు చేసి, పంచుకోవడమే తరువాయి.

1972లో తిరుపతి సమీపంలోని గాజులమండ్యం వద్ద 166 ఎకరాలను సేకరించి 1975లో అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి చేతుల మీదుగా శ్రీ వెంకటేశ్వర సుగర్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. అప్పట్లో 13వేల మంది రైతులు ఈ ఫ్యాక్టరీకి షేర్‌హోల్డర్లుగా ఉండేవారు. ప్రస్తుతం ఏడువేల మంది మిగిలారు. నిత్యం 3-5వేల మంది రైతులు తాము పండించిన చెరకు పంటను క్రషింగ్ చేసేవారు. నవంబర్‌లో క్రషింగ్ ప్రారంభం అయితే మార్చి వరకు జరిగేది. రోజుకు 1500-2000 టన్నుల క్రషింగ్ నిరంతరాయంగా జరిగేది. కడప, నెల్లూరు, చిత్తూరు, తమిళనాడు రైతులు ఈ ఫ్యాక్టరీకి చెరకును తోలేవారు. ప్రస్తుతం ఈ ఫ్యాక్టరీ నుంచి షేర్ హోల్డర్లకు రూ.50 కోట్లు బకాయి ఉంది. 600 మంది కార్మికులు పనిచేసే ఈ ఫ్యాక్టరీలో మూతబడే నాటికి 357 మంది మిగిలారు. వీరికి 20 కోట్ల పిఎఫ్, గ్రాడ్యూటీ చెల్లించాల్సి ఉంది. 2018లో ఈ ఫ్యాక్టరీ మూతబడింది.

ముక్కలు ముక్కలుగా అమ్మకానికి

ఐదేళ్ల కాలంలో యంత్రాలన్నీ తుప్పు పట్టాయి. తుప్పుపట్టిన యంత్రాలే రూ. రెండు కోట్ల విలువ చేస్తాయి. భవనం కోటిన్నర పలుకుతుంది. జగన్మోహన్‌రెడ్డి హామీ మేరకు ఈ ఏడాది తెరుస్తారు, ఈ ఏడాది తెరుస్తారు అని రైతులు ఎదురుచూస్తూనే కాలం గడిపారు. తీరా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యాక్టరీతో పాటు స్థలాన్ని సైతం ముక్కలు ముక్కలు చేసి, ప్రజాప్రతినిధులకు కట్టబెట్టేందుకు ఫైల్‌ను సిద్ధం చేసింది. వీరికి 99 సంవత్సరాలు లీజుకివ్వనుంది. వందల ఏళ్లనాటి 880 చెట్లను జెసిబిలతో కూలదోసింది. ఉన్న పాలకమండలిని రద్దు చేసి లిక్విడేటర్‌గా రవిబాబును నియమించింది. 166 ఎకరాల స్థలాన్ని చదునుచేసి సర్వే చేసేందుకు టెండర్లను సైతం పిలిచారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ఈ స్థలాన్ని ఉపయోగిస్తామని అధికార పార్టీ నేతలు చెబుతూ 99 సంవత్సరాలు లీజుకివ్వనున్నట్లుగా సమాచారం. జిల్లాకు సంబంధించిన ఓ మంత్రికి, ముగ్గురు ఎమ్మెల్యేలకు ఈ భూములను ధారాదత్తం చేసేందుకు రంగం సిద్ధమయ్యిందని తెలుస్తోంది.

ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలి

మాంగాటి గోపాల్‌రెడ్డి, రైతు సమాఖ్య



ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి. సహకార చక్కెర ఫ్యాక్టరీని తెరిపించాలి. రైతులకు, కార్మికులకు భరోసా కల్పించాలి. ప్రస్తుతం ఆస్తులను సైతం అమ్మకానికి పెట్టడం దారుణం.

చక్కెర ఫ్యాక్టరీని అమ్మాలని చూస్తే ఆమరణదీక్ష : బొజ్జల సుధీర్

రేణిగుంట : శ్రీవెంకటేశ్వర చక్కెర ఫ్యాక్టరీని అమ్మాలని చూస్తే ఆమరణ నిరాహారదీక్ష చేపడతామని బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే ఆర్నెళ్లలో ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. రేణిగుంట కన్వెన్షన్ హాలులో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర సుగర్ ఫ్యాక్టరీని అమ్మడానికి వైసిపి నేతలు కుట్రలు చేస్తున్నారన్నారు. 1500 కోట్లు విలువ చేసే ఈ భూమిని వైసిపి నేతలు ఎగరేసుకోవాలని పన్నాగాలు చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాకమందు నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా ఇక్కడ నిరాహార దీక్ష చేపట్టి రైతులకు తమ ప్రభుత్వం రాగానే న్యాయం చేస్తామని వారిని మోసం చేశారన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, మాజీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, మునిస్వామి నాయుడు పాల్గొన్నారు.

చెరకు రైతుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- కెవిబిపురం

రైతు ప్రభుత్వం అని చెప్పుకునే వైఎస్‌ఆర్సిపి ప్రభుత్వం రైతులకు ఏమీ చేయకపోయినా ఏదో చేస్తున్నామని ప్రకటన చేస్తూ, ఆర్భాటాలు చేస్తోందని, సిఎంకు చిత్తశుద్ధి ఉంటే చెరకు రైతుల బకాయిలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ ఒక ప్రకటనలో విమర్శించారు. జిల్లాలో చెరుకు రైతులకు ఇంత అన్యాయం జరుగుతున్నా ముగ్గురు మంత్రులు ఈ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ 13 మంది ఎమ్మెల్యేలు ఈ జిల్లా నుంచి అత్యధిక మెజారిటీతో గెలిచిన వారు ఉన్నా ఈ జిల్లా రైతాంగం గురించి పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. నేతం, మయూర సుగర్ ఫ్యాక్టరీల యాజమాన్యం నుంచి రైతులకు రావాల్సిన 60 కోట్ల బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చెరుకు రైతులకు గిట్టుబాటు ధరను కేంద్ర ప్రభుత్వం నామమాత్రంగా క్వింటాలకు పది రూపాయలు పెంచడం దారుణమన్నారు. చెరుకు పంటకు ఒక టన్నుకు ఐదువేల రూపాయలు వంతన మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు.



ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

ప్రజాశక్తి -పలమనేరు

ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని పలమనేరు సిపిఎం పట్టణ కార్యదర్శి గిరిధర గుప్తా సోమవారం ఓ ప్రకటనలో ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు పట్టణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వస్తున్న సందర్భంగా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజును పోలీసులు వలయంలో నిర్బంధించడం ఎంతవరకు సమంజసం అని నిలదీశారు. ముఖ్యమంత్రి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు చెప్పుతూ ప్రజలు ఆశీస్సులు పొందడానికి వస్తున్నారే కానీ ఇలాంటి నిర్బంధాలతో ప్రశ్నించే నాయకులను ఇబ్బందులకు గురి చేయడం ఏ రాజ్యాంగంలో ఉందని మండిపడ్డారు. 2024 ఎన్నికలలో ప్రజలే గట్టి బుద్ధి చెప్తారని అన్నారు.

తిరుచానూరు
పెద్ద చెరువును కాపాడండి : సిపిఎం

కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-తిరుచానూరు

తిరుచానూరు పెద్ద చెరువును కాపాడాలని, 99 సంవత్సరాల లీజును రద్దు చేయాలని, కోట్ల రూపాయల విలువ చేసే భూమిని కాపాడాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం గ్రీవెన్స్‌లో వినతిపత్రం సమర్పించారు.నాయకులు ఎస్.జయచంద్ర, సుమన్, చిన్నా, చిరంజీవి మాట్లాడుతూ తిరుచానూరులో ఉన్న చెరువు 125ఎకరాల విస్తీర్ణం ఉండేదని, ఆక్రమణలకు గురై 16 ఎకరాలు మిగిలిందన్నారు. ఈ భూమిని తుడా ప్రైవేట్ వ్యక్తులకు 99 ఏళ్లు లీజుకు ఇవ్వడం అభ్యంతరకరమన్నారు. ఈ చెరువును పూడ్చివేయడం వల్ల దాదాపు రెండు పంచాయతీలు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. పెద్ద వర్షాలు కురిస్తే నీళ్లు బయటకు పోయే పరిస్థితి లేక ముంపు ఏర్పడే అవకాశం ఉందన్నారు. సుప్రీం తీర్పు ప్రకారం కేవలం 33 ఏళ్లు మాత్రమే లీజుకు ఇవ్వాలన్నారు. లీజును రద్దు చేయని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

వైఎస్సార్ బీమా ధ్రువపత్రాలు గడువులోగా సమర్పించాలి

అధికారులతోమాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతిటౌన్: వైయస్సార్ భీమా క్లైమ్ కొరకు అవసరమయ్యే ధ్రువపత్రాలను సకాలంలో నిర్దేశిత గడువులోపు సంబంధిత భీమా సంస్థ కు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ కే వెంకట రమణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో వైఎస్సార్ భీమా క్లైమ్ లపై జిల్లా గ్రామ వార్డు సచివాలయం ఇంఛార్జి అధికారి సుశీల దేవి, డిఎల్డిఓ ఆది శేషారెడ్డి, డిసిహెచ్ఎస్ అధికారిణి మణి తదితర సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షిస్తూ మరణించిన వైయస్సార్ భీమా పాలసీదారుకు సంబంధించిన క్లైమ్ ధ్రువ పత్రాలు సకాలంలో నిర్దేశిత గడువులోగా గ్రామ వార్డు సచివాలయం సంక్షేమ సహాయకులు ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని, డిఆర్డిఎ పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రమాద బీమా క్లైమ్ కొరకు సమర్పించే ఎఫ్ఐఆర్, పోస్ట్ మార్టం రిపోర్ట్ తదితర నివేదికలు సకాలంలో నిర్దేశిత గడువులోపు సదరు భీమా సంస్థకు పూర్తి స్థాయిలో అందించేలా ఉండాలని తెలిపారు. భీమా సంస్థ చెల్లింపులు సకాలంలో జరగాలని తెలిపారు.

అభివృద్ధే ధ్యేయం : అభినయ్‌రెడ్డి

వార్డుల్లో పర్యటిస్తున్న అభినయ్ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతిటౌన్ : తిరుపతి అభివద్దే ధ్యేయంగా అందరి సహకారంతో పనిచేస్తున్నామని తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 12వ డివిజన్లో చేపట్టిన అభివద్ధి పనులను డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, ఆ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్.కె. బాబు, కార్పొరేటర్ ఆంజినేయులుతో కలిసి భూమన అభినయ్ రెడ్డి 12 డివిజన్ కెనడి నగర్లో నిర్మించిన సిసి రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి నగరంలో అభివద్ధికి తమ నగరపాలక సంస్థ కౌన్సిల్ పూర్తి స్థాయిలో పని చేస్తున్నదన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లతో తిరుపతి ప్రజలకు సౌకర్యవంతంగా రహదారులు అందుబాటులోకి వచ్చాయని, నగరంలో ట్రాఫిక్ తీవ్రతను తగ్గించేందుకు నిర్మించిన ఫ్రీ లెప్టుల వలన ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అభినయ్ తెలిపారు. 12వ డివిజన్ కార్పొరేటర్ ఎస్.కె.బాబు మాట్లాడుతూ 40 లక్షలతో తమ డివిజన్లో సిసి రోడ్లు, అంకాలమ్మ గుడి నుండి ఓల్డ్ వెంకటేశ్వర థియోటర్ వరకు తారు రోడ్డు నిర్మించేందుకు సహాయ సహకారాలు అందించిన డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డికి ఈ సందర్భంగా కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ డిఈ సంజీవ్ కుమార్, మాజీ జెడ్.పి.టి.సి వెంకటమునిరెడ్డి, హరినాథ్, మురళీ, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు, ఇతర కేటగిరీ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఎన్‌హెచ్‌ఎం ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేసి పరిపాలన అధికారికి వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా నర్సుల సంఘం జిల్లా కార్యదర్శి లత మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఉద్యోగులఅందరి కంటే తక్కువ వేతనాలు ఇవ్వడం దారుణమని వాపోయారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా మాట్లాడుతూ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. బంగారుపాళ్యం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో పనిచేస్తున్న ముగ్గురు స్టాఫ్‌నర్సులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని శశికళ అధికారులను ప్రశ్నించారు. పనిభారం ఎక్కువగా ఉన్నందున ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు చెప్పారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చైతన్య మాట్లాడుతూ కలెక్టర్ జోక్యం చేసుకుని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

విజయ డెయిరీ స్క్రాబ్ అవినీతిపై విచారణ జరిపించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లాకే తలమానికంగా ఉన్న దేశంలోనే అతిపెద్ద రెండవ సహకార సంఘమైన విజయ డెయిరీ గత ప్రభుత్వాల తప్పిదాల వలన మూసివేయడం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం ప్రారంభిస్తామని చెప్పి గుజరాత్ అమూల్‌కి అప్పనంగా అప్పగిస్తోందని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఆయన మాట్లాడుతూ విజయ డెయిరీని అమూల్‌కు అప్పగించే క్రమంలో డెయిరీలో ఉన్న ఇనుము, స్టీల్‌ను స్క్రాబ్ పేరుతో సుమారు రూ.7కోట్లు విలువచేసే స్క్రాబ్‌ని కోటి 40లక్షలకు అధికారపార్టీ వ్యాపారికి అప్పగించిందని, ఇందులో కోట్ల రూపాయలు చేతులు మారినట్లు అర్థమవుతోందని, ఈ కుంభకోణం అవినీతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్రజల ఆస్తిని అప్పనంగా ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తున్న ప్రభుత్వం స్క్రాబ్‌లో కూడా ఇంత అవినీతికి పాల్పడం దుర్మార్గమన్నారు. ఏడు కోట్ల రూపాయలకు అమ్మితే వచ్చే డబ్బులను రైతులకు కొంత వరకు వారి వాటాలను చెల్లించవచ్చు అని అలా కాకుండా టెండర్లు పిలువకుండా విస్తతమైన ప్రచారం చేయకుండా అంతరహస్యంగా వేలం వేశారంటే కోట్లరూపాయలు అవినీతి జరిగిందని స్పష్టమవుతోందన్నారు. ఇప్పటికైనా అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

మహాశక్తి కార్యక్రమానికి తరలిన మహిళలు

ప్రజాశక్తి-గూడూరు: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా మహాశక్తితో లోకేష్ కార్యక్రమానికి గూడూరు నియోజకవర్గం నుండి తెలుగు మహిళలు నెల్లూరు అనిల్ గార్డెన్స్‌లో జరగబోయే సమావేశానికి భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా తెలుగు మహిళా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో వైసీపీ మహిళా ఓట్లతో గల్లంతవుతుందని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవైందని ఆరోపించారు. తిరుపతి పార్లమెంటు జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తాళ్ల సుబ్బమ్మ, నియోజకవర్గంలోని మహిళా నాయకులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తనిఖీ

ప్రజాశక్తి-దొరవారిసత్రం: దొరవారిసత్రంలోని ప్రభుత్వాసుపత్రిని జిల్లా డీపీఎంవో శ్రీనివాసులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యసేవలు సక్రమంగా అందుతున్నాయా అని రోగులను అడిగి తెలుసుకున్నారు. పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. కొత్తపల్లిలో జరుగుతున్న విలేజ్ డాక్టర్స్ క్లినిక్‌ను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో మైథిలి, సచివాలయం ఏఎన్ఎం సురేఖ, హెల్త్ అసిస్టెంట్ వెంకటయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువులకు వైద్యసేవలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రామకృష్ణాపురం పంచాయతీలోని సదాశివపురం ఎస్టీ కాలనీలో సర్పంచ్ విరిత ఆధ్వర్యంలో సోమవారం పశువులకు, దూడలకు వైద్యసేవలు అందించారు. పిడుదుల నివారణకు మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రసన్న, వెటర్నరీ అసిస్టెంట్ శశికళ, నాయకులు దేవేంద్ర రెడ్డి, రామచంద్ర, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన కోట టీడీపీ నాయకులు

ప్రజాశక్తి -కోట : మాజీ మంత్రి అమర్నాథ్‌రెడ్డిని కోట మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు సోమవారం పలమనేరులో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మద్దాలి సర్వోత్తమ్‌రెడ్డి నెల్లూరు మోహన్‌రెడ్డి, ఎస్‌కే జలీల్‌బాషా, కోకర్ల మధు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసాయి సేవలో వినోద్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి-కోట: కోట మండలంలోని శ్యామసుందరపురం కాలనీలో వెలసిన శ్రీ సాయిబాబా మందిరంలో సోమవారం గురు పూర్ణిమ సందర్భంగా యువనేత వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీసాయి మార్గ్ ట్రస్ట్ సభ్యులు నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డికి ఆలయ సంప్రదాయం ప్రకారం శాలువ పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

రోటరీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం తిరుచానూరులోని నవజీవన్ అంధుల సహాయ కేంద్రంలో నిర్వహించారు. తిరుపతి రోటరీ క్లబ్ అధ్యక్షులుగా కెవి. ఫణిరాజ కుమార్, ఉపాధ్యక్షులుగా నాగరాజు నాయుడు, కార్యదర్శిగా సోము రవికుమార్, సంయుక్త కార్యదర్శిగా లక్ష్మీపతి, కోశాధికారిగా పురుషోత్తం పటేల్, డైరెక్టర్లు, చైర్మన్లుగా పలువురు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నవజీవన్ ఆశ్రమానికి రెండున్నర లక్షల విలువగల నేత్ర పరీక్షల యంత్రం, ఒకటిన్నర లక్షల విలువ గల ఇతర వస్తువులను రొటేరియన్ మట్టా పురుషోత్తం రెడ్డి వితరణగా అందించారు. సమావేశంలో రోటరీ భవనాన్ని నిర్మించడానికి నూతన కమిటీ నిర్ణయించిందని అధ్యక్షులు ఫణిరాజ కుమార్ తెలిపారు. ఈ భవన నిర్మాణం కోసం రాజేంద్ర శెట్టి, సుధాకర్ రెడ్డి, సోంప్రకాష్, దామోదర గుప్తా ఒక్కొక్కరు రూ.లక్ష ప్రకటించారన్నారు. తిరుపతి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో త్వరలో తల్లిపాల నిధిని ప్రభుత్వ మెటర్నిటీ హాస్పిటల్లో ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ఎన్నికైన సతీష్ మాధవన్, అసిస్టెంట్ గవర్నర్ చక్రాల ఉష ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

అపవిత్రం.. తలకోన పుణ్యక్షేత్రం

- ఆలయ పరిసరాల్లోనే మాంసం, మద్యం విక్రయాలు
- విచ్చలవిడిగా పేకాట స్థావరాలు
- పర్యాటకులకు ఆకతాయిల ఆటంకాలు
- అధికారుల చర్యలు అంతంతమాత్రం

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: ప్రముఖ పర్యాటక కేంద్రంగా పేరుగాంచిన తలకోన శ్రీసిద్దేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గత కొద్ది కాలంగా మాంసం, మద్యం విక్రయాలు చేస్తూ అపవిత్రం చేస్తున్నారు. మద్యం అయితే ఏరులై పారుతోంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చేటువంటి యాత్రికులు రాత్రి వేళల్లో స్థానికంగా ఉన్న ప్రైవేటు హోటల్లో గదులు తీసుకొని ఇష్టానుసారంగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. ఇందులో భాగంగానే సోమవారం ఓ ప్రైవేటు హోటల్ ముందు మాంసం వండుకొని తినడం విశేషం. మాంసం తింటూ మద్యం తాగుతూ చిందులు వేస్తూ అటవీ ప్రాంతంలో ఇష్టారాజ్యంగా పేకాట స్థావరాలను ఏర్పాటు చేసుకున్నారు. తలకోన లో ఉన్న ప్రైవేటు హోటళ్ల యాజమాన్యం డబ్బే పరమావధిగా భావించి ఇష్టానుసారంగా ఆలయ ప్రాంగణంలో అసాంఘిక కార్యక్రమాలకు మూలకారణమవుతున్నారు. విచ్చలవిడిగా మాంసం విక్రయాలతో పాటు మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.



తెలిసినా పట్టించుకోని అధికారులు

పుణ్యక్షేత్రంలో ఇలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నా పోలీసులు.. ఆలయ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణం. గతంలో చాలాసార్లు పత్రికల్లో వార్తా కథనాలతో హెచ్చరించినప్పటికీ నామమాత్రంగా పోలీసులు కాపలా పెట్టినట్లు చెబు తున్నారు. తలకోన పుణ్యక్షేత్రంలో ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నప్పటికీ అధికారులు ఎందుకు పట్టించుకోలేదో అర్థం కాని పరిస్థితి. గత కొద్దికాలం నుంచి తలకోన అంటేనే భద్రత లేని ఒక అడవిగా మారిపోయింది. దీనిపై చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రత్యేక దష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ పంపిణీ

ప్రజాశక్తి-కోట: కోట మండలంలో నారా లోకేష్ పాదయాత్ర సాగుతుండగా ఆకస్మికంగా మధ్యలో వంజివాక గ్రామంలో నివసించే సలవాది శ్రీనివాసులు అనే వికలాంగుడిని గమనించిన లోకేష్ బాబు పాదయాత్ర నిలిపి అతని ఆవేదన విని వెంటనే తన సిబ్బందితో ట్రై సైకిల్ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. లోకేష్ మాట చెప్పిన ప్రకారం కోట పట్టణానికి ట్రై సైకిల్‌ను పంపడంతో సోమవారం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందించారు. కార్యక్రమంలో షేక్.జలీల్ అహ్మద్, కోకర్ల మధు యాదవ్, కొనిశెట్టి రమేష్, కోటారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అందరికీ సమన్యాయం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: అందరికీ సమ న్యాయం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారని ఎంపీడీవో డీవీ నరసింహారావు తెలిపారు. పల్లమాల, కాటూరు సచివాలయాలలో సోమవారం ఆయన జగనన్న సురక్షపై సచివాలయాల ఉద్యోగులు, వాలంటీర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంపై పలు సలహాలు, సూచనలు అందించారు.

విశ్వం స్కూల్‌కు నేషనల్ ఐకాన్ ఇన్‌స్టిట్యూట్ అవార్డు

ప్రజాశక్తి-క్యాంపస్: జాతీయ స్థాయిలో తిరుపతి విశ్వం విద్యా సంస్థలకు "ఐకాన్ కోచింగ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ది ఇయర్ -2023" అవార్డ్ ను పీ.ఐ.పీ.ఆర్ సంస్థ ప్రకటించింది. ఈ అవార్డును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి చేతుల మీదుగా విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వ నాథ్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా పీఐపీఆర్ గ్రూప్ ప్రతినిధులు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో గత 33 సంవత్సరాలుగా తిరుపతి విశ్వం విద్యా సంస్థలు స్కూల్ సిలబస్ తో పాటు సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలకు ఉత్తమ శిక్షణ ఇస్తూ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలను, మార్కులు, ర్యాంకులను విశ్వం సాధిస్తున్నందుకు ఈ అవార్డు కు ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఎంపీపీ తనిజారెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-వెంకటగిరి: తిరుపతి జిల్లా ఎంపీపీల అధ్యక్షురాలు తమ్మిరెడ్డి తనిజారెడ్డిని సోమవారం ప్రకాశం జిల్లా ఎంపీపీల అధ్యక్షుడు వెంకటరెడ్డి తన నివాసంలో సన్మానం చేశారు. ఆయన వెంకటగిరిలో శివారెడ్డి నివాసానికి మర్యాదపూర్వకంగా వచ్చి తమ సహ సోదరుని, ఎంపీపీ తనిజారెడ్డిని సన్మానించారు. వాకా వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. ప్రజలకు అండ

- గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్

ప్రజాశక్తి -గూడూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే దవీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని ఆ పత్రాలను ఇంటి వద్దే అందించి పథకాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా రూపొందించిందని ఆర్డీవో కిరణ్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా ఆర్డీవో మాట్లాడుతూ జగనన్న సురక్ష ప్రజలకు ఓ అండ అని.. కార్యక్రమానికి ప్రజలు సహకరించి సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో కోరారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది జగనన్న సురక్ష గడపగడప సర్వే కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించి కుటుంబాలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలని ఆర్డీవో తెలిపారు. ముందుగా ప్రతి కుటుంబానికి వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది వెళ్లి అవసరమైన ధ్రువీకరణ పత్రాల వివరాలను సమగ్రంగా సేకరించి నమోదు చేసుకుంటారని.. అనంతరం సురక్ష సర్వే జరిగిన 7వ రోజు నుంచి కుటుంబాలకు అవసరమైన ధ్రువపత్రాలను గ్రామసభలు నిర్వహించి ఉచితంగా అందిస్తారన్నారు. తప్పనిసరిగా 11 రకాల అంశాలకు సంబంధించి ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ఇప్పించాల్సిన బాధ్యత అన్ని శాఖల అధికారులపై ఉందని వివరించారు.

ఎమ్మెల్యేగా గెలిస్తేనే.. ఆలయంలో అడుగు పెడుతా..!

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: చంద్రగిరి నియోజకవర్గంలో రాబోయే సార్వత్రిక ఎన్నికలలో ఎమ్మెల్యేగా గెలిచిన తరువాతనే తలకోన ఆలయంలో అడుగు పెట్టి దైవదర్శనం చేసుకుంటానని.. అంతవరకు గుడి లోపలకు వచ్చి శివుని దర్శనం చేసుకోనని చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తెలిపారు. భవిష్యత్తు గ్యారెంటీ ప్రచార రథయాత్రలో భాగంగా సోమవారం భాకరాపేట మీదుగా రోడ్డు మార్గాన ఎర్రావారిపాలెం , నెరబైలు పంచాయతీలలో బస్సు యాత్రను కొనసాగించి మధ్యాహ్నం తలకోనకు చేరుకున్నారు. రోడ్డు మార్గంలో ప్రజలతో ఆప్యాయంగా పలకరించి అభివాదం తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అందించారు. అనంతరం మీడియాతో నాని మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలు ఎంతో ఆప్యాయంగా స్వాగతం పలుకుతూ అభివద్ధి చెందాలంటే నాని గెలవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. అలాగే అధికార పార్టీ ఎమ్మెల్యే ఓటర్లకు చీరలు, స్వీట్ బాక్స్‌లు ఇచ్చి మభ్యపెట్టి ప్రలోభాలకు గురిచేసి ప్రజలకు మాయ మాటలు చెప్పి మోసం చేస్తున్నారని విమర్శించారు. ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపుతానన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలలో కచ్చితంగా చంద్రగిరి నియోజకవర్గంలో టిడిపి జెండాతో పులివర్తి నాని గెలవడం ఖాయమని చిత్తూరు ఎమ్మెల్సీ దొరబాబు తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాసులు, గాలి భాను ప్రకాష్, కటారి హేమలత, బొజ్జల సుధీర్ రెడ్డి, మబ్బు దేవనారాయణరెడ్డి, భారీ సంఖ్యలో టిడిపి కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని నెలబల్లి గ్రామంలో సోమవారం పెళ్లకూరు మండలం ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎన్‌డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు గజమాలలతో ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ప్రిస్కిల్లా, మండల సీనియర్ నాయకులు రమణారెడ్డి, లింగం నాయుడు, సోమశేఖర్ రెడ్డి, సురేష్‌రెడ్డి, వెంకటకష్ణారెడ్డి, అట్ల కష్ణయ్య, రఘు నాయుడు, అన్ని శాఖల అధికారులు, నాయకులు, ఎంపీటీసీలు , సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒప్పంద అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకుల సమస్యలను తన దష్టికి తీసుకురావడం జరిగిందని, వారి సమస్యల్ని సత్వరమే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని సెనెట్ హాల్లో తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని ఎస్వియూ ఒప్పంద అధ్యాపకుల సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఉమామహేశ్వర్ రెడ్డి, ప్రొఫెసర్ పద్మావతమ్మ, దామోదర్ రెడ్డి, అకడమిక్ కన్సల్టెంట్ అధ్యక్షుడు కల్లూరి కిషోర్కుమార్ రెడ్డి, కార్యదర్శి ఐ ఎస్ కిషోర్, ఉపాధ్యక్షుడు ఆనంద్ అమతరాజ్, కోశాధికారి శివశంకర్, సభ్యులు ప్రవీణ్, దామోదర్, రాజేశ్వరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మన ఆరోగ్యం..మన బాధ్యత

ప్రజాశక్తి-క్యాంపస్: చంద్రగిరి మండలం గంగుడుపల్లి, మండపంపల్లి, దోర్నకంబాల, మల్లయ్యపల్లి, రాయలపురం గ్రామాల్లో జరిగే ఉచిత వైద్య శిబిరాలను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి సోమవారం పర్యవేక్షించారు. ప్రతిఒక్కరూ వీలు కల్పించుకుని సమీపంలోని ఉచిత వైద్య శిబిరాల వద్ద రక్త నమూనాలు ఇవ్వాలని, గుండె పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ముందస్తు వైద్య పరీక్షలతో ఆకస్మిక మరణాల సంఖ్యను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని హెచ్చరించారు.

గోడపత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి-పిచ్చాటూరు: రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 10, 11 తేదీల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం జరుగుతుందని.. కార్యక్రమానికి జిల్లాలోని అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి రామచంద్రారెడ్డి, పిచ్చాటూరు ప్రాజెక్టు అధ్యక్షురాలు ఇంద్రాణి, అంగన్వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి రాజేశ్వరి తెలిపారు. సోమవారం పిచ్చాటూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీడీపీవోకు అందించారు. అనంతరం డిమాండ్లతో కూడిన గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు రాజేశ్వరి, కృష్ణవేణి, విజయలక్ష్మి, నాగభూషణమ్మ, దీప, అముద, ధనలక్ష్మి, జయలక్ష్మి, పద్మావతి, హంస, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: కలెక్టర్ కార్యాలయం ఎదుట జరుగనున్న ధర్నాను జయప్రదం చేయాలని నాయుడుపేట మండలం అంగన్వాడీ కార్యకర్తలు సోమవారం ఉదయం గోడపత్రికలను విడుదల చేశారు. సిఐటియు నాయకులు ముకుంద, అంగన్‌వాడీ ప్రాజెక్ట్ కార్యదర్శి శ్యామలమ్మ, కళావతి, పుష్పలత, మేరీ, ప్రమీల సభ్యులు పాల్గొన్నారు.

నేడు కియా ఇండియా సెల్టోస్ ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: కియో ఇండియా కొత్త సెల్టోస్‌ను 4వ తేదీ మంగళవారం విడుదల చేస్తున్నామని ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కియా ఇండియా, భారతదేశపు ప్రీమియం, అతి వేగంగా అభివద్ధి చెందుతున్న కారు తయారీదారు కొత్త అవతారంలోని సెల్టోస్, తాజాడిజైన్, శ్రేణిలోనే మెరుగైన ఫీచర్స్ ను కలిగి, తమ శ్రేణిలోని ప్రముఖ ఫీచర్స్, డిజైన్తో ఆటోమొబైల్ పరిశ్రమలోనే సెల్టోస్ బ్రాండ్ కొత్త విప్లవాన్ని ఆరంభించిందని పేర్కొన్నారు. కొత్త సెల్టోస్ శ్రేణిని మరోసారి పునఃకనుగొనడానికి సిద్ధంగా ఉంది. 2023 జూన్ 30న కొత్తసెల్టోస్ టీజర్‌ను విడుదల చేసింది. తక్కువ సమయంలో కేవలం 46 నెలల్లో, సెల్టోస్ 5 లక్షల మైలురాయి సేల్స్ ను దాటిన అతి వేగవంతమైన ఎస్ యూవీగా మారింది. ప్రస్తుతం 3.78 లక్షల సెల్టోస్ భారతదేశపు రహదారులపై ప్రయాణిస్తున్నాయి. ఇది కిన్ మొత్తం దేశీయ పరిమాణంలో 53 శాతంగా ఉంది. కంపెనీ అంతర్జాతీయంగా దాదాపు 1.39 లక్షలసెల్టోస్ ను సుమారు 90 శాతం మార్కెట్స్ కు ఎగుమతి చేసిందని తెలిపారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్మశాన స్థలం కేటాయింపు

ప్రజాశక్తి-బాలాయపల్లి : కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని మన్నూరు అరుంధతి వాడ వాసులకు సోమవారం శ్మశాన స్థలాన్ని తహశీల్దారు శ్రీనివాసులు కేటాయించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో శ్మశానం ఆక్రమణలో ఉందని తెలియజేయడంతో ఆర్డీవో వెంటనే స్పందించి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచి, అధికారులు పాల్గొన్నారు.

ఇండియన్ పాస్పోర్ట్ మిస్సింగ్

శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని కలవగుంట గ్రామానికి చెందిన లక్ష్మి నారాయణకు చెందిన ఒరిజినల్ ఇండియన్ పాస్పోర్ట్ నంబర్ W2297291 వారు తమ గ్రామంలో ఇల్లు మారుతుండగా దారపోయినదని ఎవరికైనా దొరికితే 6281172994 ద్వారా తమకు సమాచారం ఇవ్వగలరని కోరుతున్నారు.

మహారాజశ్రీ తిరుపతి 3వ అడిషినల్ జిల్లా జడ్జిగారి కోర్టులో
ఎం.వి.ఓ.పి.నెం. 13/2020
ఆర్.గీత భర్త లేట్ ఆర్.ప్రకాష్ ...పిటీషనర్
V/s
పి.రాజశేఖర్ అనే రాజు మరియు ఇరువురు ...రెస్పాండెంట్స్
1వ రెస్పాండెంట్ యాక్సిడెంట్ నోటీసులు
ఆర్1) పి.రాజశేఖర్ అనే రాజు తండ్రి లేట్ పి.పరమశివం డ్రైవర్ డి.నెం.4-2-253, గిరిపురం, తిరుపతి
పై యాక్సిడెంట్ కేసులో 11.3.2019 తేదీన తిరుపతి, చెర్లోపల్లి మెయిన్ రోడ్, సైన్స్ సెంటర్ దగ్గర జరిగిన ప్రమాదంలో పిటీషనర్ కుమారుడు ఆర్.బాలాజీ అక్కడికక్కడే మరణించినారు. సదరు ఆర్.బాలాజీ తండ్రిగారు ఇదివరలోనే చనిపోయినారు. సదరు పిటీషనర్ చనిపోయి ఆర్.బాలాజీ పై ఆదారపడి జీవించుచున్నారు. సదరు పిటీషనరు తన కుమారుని యొక్క మరణమునకు కారణమైన వారిపై పై కోర్టు నందు రూ.40,00,000 లకు నష్ట పరిహారం కొరకు వేసియున్నది. సదరు యాక్సిడెంట్‌కు సంబంధించి 1వ రెస్పాండెంట్ డ్రైవరు గాను 2వ రెస్పాండెంట్, వెహికల్ ఓనర్‌గాను 3వ రెస్పాండెంట్ ఇన్సూరెన్స్ కంపెనీగా ఉంటున్నారు. సదరు యాక్సిడెంట్ కేసు నందు యాక్సిడెంట్ చేసిన 1వ రెస్పాండెంట్ హాజరు నిమిత్తం 17.07.2023 తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు తేదీన 1వ రెస్పాండెంట్ అయిన పై కనిన కోర్టుకు ఉదయం 10.30 గం॥లకు నైరులో నైననూ, వకీలు ద్వారా అయినను హాజరై నీకు గల అభ్యంతరములు తెలుపు కొనవలెను. లేని యెడల నీ పరోక్షముగా తీర్మానించబడును.
వాయిదా 17.07.2023
ఇరుగు సురేంద్ర, వి.నారాయణరావు,
పిటీషనర్ తరపు న్యాయవాదులు

మహారాజశ్రీ తిరుపతి 3వ అడిషినల్ జిల్లా జడ్జిగారి కోర్టులో
ఎం.వి.ఓ.పి.నెం. 14/2020
ఆర్.గీత భర్త లేట్ ఆర్.ప్రకాష్ ...పిటీషనర్
V/s
పి.రాజశేఖర్ అనే రాజు మరియు ఇరువురు ...రెస్పాండెంట్స్
1వ రెస్పాండెంట్ యాక్సిడెంట్ నోటీసులు
ఆర్1) పి.రాజశేఖర్ అనే రాజు తండ్రి లేట్ పి.పరమశివం డ్రైవర్ డి.నెం.4-2-253, గిరిపురం, తిరుపతి
పై యాక్సిడెంట్ కేసులో 11.3.2019 తేదీన తిరుపతి, చెర్లోపల్లి మెయిన్ రోడ్, సైన్స్ సెంటర్ దగ్గర జరిగిన ప్రమాదంలో పిటీషనర్ కుమారుడు ఆర్.బాలాజీ అక్కడికక్కడే మరణించినారు. సదరు ఆర్.బాలాజీ తండ్రిగారు ఇదివరలోనే చనిపోయినారు. సదరు పిటీషనర్ చనిపోయి ఆర్.బాలాజీ పై ఆదారపడి జీవించుచున్నారు. సదరు పిటీషనరు తన కుమారుని యొక్క మరణమునకు కారణమైన వారిపై పై కోర్టు నందు రూ.20,00,000 లకు నష్ట పరిహారం కొరకు వేసియున్నది. సదరు యాక్సిడెంట్‌కు సంబంధించి 1వ రెస్పాండెంట్ డ్రైవరు గాను 2వ రెస్పాండెంట్, వెహికల్ ఓనర్‌గాను 3వ రెస్పాండెంట్ ఇన్సూరెన్స్ కంపెనీగా ఉంటున్నారు. సదరు యాక్సిడెంట్ కేసు నందు యాక్సిడెంట్ చేసిన 1వ రెస్పాండెంట్ హాజరు నిమిత్తం 17.07.2023 తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు తేదీన 1వ రెస్పాండెంట్ అయిన పై కనిన కోర్టుకు ఉదయం 10.30 గం॥లకు నైరులో నైననూ, వకీలు ద్వారా అయినను హాజరై నీకు గల అభ్యంతరములు తెలుపు కొనవలెను. లేని యెడల నీ పరోక్షముగా తీర్మానించబడును.
వాయిదా 17.07.2023
ఇరుగు సురేంద్ర, వి.నారాయణరావు,
పిటీషనర్ తరపు న్యాయవాదులు